క్లుప్తంగా

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ అన్నారు. సోమవారం కరీంపూర్ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో బార్వాద్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మోయినొద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలకు అనిల్ మాట్లాడారు. జిల్లాలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమన్నారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, నాయకులు దశరథ్‌గౌడ్, కొండల్‌రెడ్డి, రాంచందర్, జయానందం, మహబూబ్, రషీద్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మండల పరిధి బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం గిరిప్రదక్షిణ శోభాయమానంగా కొనసాగింది. నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాంబండ క్షేత్రానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఆర్బీఎల్ కంపెనీ చైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీపీ మల్లేశం తెలిపారు. ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సమావేశం ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదవేడు తండాకు రోడ్డు మార్గం లేకపోవడంతో గతంలో తండా వాసులందరూ ఆయనను కలిసి విన్నవించుకున్నారు. వారి విన్నపం మేరకు శంషాబాద్ రోడ్డు నుంచి తండాకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసినందుకు వారందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి పార్టీలకతీతంగా పాటుపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చూడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలుగౌడ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, బండ్లగూడ మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, ప్రేమ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

షాబాద్: రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అవినాశ్‌రెడ్డి సమక్షంలో కుర్వగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్‌యాదవ్, రాందాస్‌యాదవ్, నర్సింలుయాదవ్, శివరాజ్‌యాదవ్, శివకుమార్‌ముదిరాజ్, రాంచంద్రయ్య, సదానందం, శివకృష్ణ, మహేందర్, కృష్ణ, శంకరయ్య, రాములు, రాజ్‌కుమార్‌స్వామి, రామస్వామి, రమేష్, నరేష్‌కుమార్, నవీన్, శంకర్, నర్సింలు, మాధవలు, శివ, చంద్రయ్యతో పాటు మరి కొంత మంది గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ఏవైనా రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.వెంకటయ్య, పార్టీ నాయకులు శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న నీటి ప్రమాదాలు


భారీ వర్షాలతో నిండుకుండలా కనిపిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు

నీటిలో సరదాగా గడపాలనే కోరిక, చేపల వేటపై మక్కువ తదితర కారణాలతో పలువురు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. నీటి సామర్థ్యాన్ని అంచనా వేయక విగతజీవులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ఆయా కుటుంబాలకు గుండె కోత తప్పడం లేదు.

- ఈత సరదా, చేపల వేటకు వెళ్లి పలువురి మృత్యువాత
- శోక సంద్రంలో కుటుంబాలు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

యాలాల: దుద్యాల మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లిలో శుక్రవారం ఈత కోసం వెళ్లి ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ఘటన మరువక ముందే ఆదివారం మండలంలోని ముకుందాపూర్‌తండాలో పాలిటెక్నిక్ విద్యార్థి చెరువులో ఈతకు వెళ్లి నీటమునిగి మృతిచెందాడు. సోమవారం ఉదయం మండల కేంద్రానికి చెందిన పకీరప్ప అనే యువకుడు శివసాగర్ సమీపంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ఇలా రోజుకొకరూ ఏదో ఒక కారణంతో నీటమునిగి మృత్యువాతపడుతున్నారు. ఈత సరదా ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుంది. చిన్నపాటి నిర్లక్ష్యం తల్లిదండ్రుల కడుపు కోతకు కారణమవుతుంది.

నిండుకుండల్లా చెరువులు, కుంటలు

ఈ ఏడాది అనుకున్న స్థాయి కంటే అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడ చూసిన చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. వరద కారణంగా కొందరూ చేపల వేటకు వెళ్తుంటే, మరి కొందరూ ఈత సరదా కోసం నీళ్లలోకి వెళ్లి ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో అటు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉంటూ పిల్లలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలి.

భారీ తవ్వకాలే కారణం

కాగా ఇటీవల వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నీటి ప్రమాదాలకు కొన్ని కారణాలు తెలుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన సంఘటనలో నీటి లోతుపై అవగాహన లేకనే ప్రమాదాలు జరిగి మృత్యువాతపడుతున్నారు. అయితే ఆయా గ్రామ శివారులో ఉన్న చెరువుల్లో నల్లమట్టి కోసం గతంలో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి వదిలేశారు. ప్రస్తుతం అన్ని చెరువులు నిండుకుండలా మారాయి. దుద్యాల మండలంలో జరిగిన ఘటనతో పాటు ముకుందాపూర్‌తండాలో విద్యార్థి మృతికి చెరువులో తెలియని లోతే కారణమని బాధిత కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సెలవు రోజులో కుటుంబ సభ్యులు తమ పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.


ముకుందాపూర్ తండా చెరువు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి

పర్యవేక్షణతోనే రక్షణ



భారీ వర్షాల నేపథ్యంలో ప్రతీ గ్రామంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయి. లోతు తెలియక యువకులు, విద్యార్థులు చెరువు ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఇటువంటి విషయాల్లో కుటుంబ పెద్దలు, సభ్యుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల పెరుగుతున్న ఈ సంఘటనలు దురదృష్టకరమైనవి. అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉంటే ఇటువంటి సంఘటనలు ఎదురుకాకుండా ప్రాణనష్టం జరగకుండా ఉండే అవకాశం ఉంది.

– విఠల్‌రెడ్డి, ఎస్ఐ, యాలాల

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం


అమలుకాని హామీల వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామని పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయడం లేదన్నారు. గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారులకు అందడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పక్షపాత ధోరణి అలంబించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలలో స్థానిక ఎన్నికల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోడానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్‌నాయక్, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు మేగ్యానాయక్, రాజప్ప, రాజు, సునంద, రాములు, కొండయ్య, శ్రీనివాస్, నర్సింలు, లక్ష్మయ్య, రాజశేఖర్, నర్సింలు, పులిరాములు, మొగులయ్య, శంకర్‌నాయక్, దాస్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం తప్పనిసరి

సీడీపీఓ మెహర్ ఉన్నిసా బేగం

దోమ: చిన్నారుల ఆరోగ్య ప్రగతిని పోషణ్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని సీడీపీఓ మెహర్ ఉన్నిసా బేగం అన్నారు. సోమవారం మండల పరిధిలోని మైలారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసే బాలామృతం, కోడి గుడ్లు క్రమం తప్పకుండా అందివ్వాలన్నారు. పోషక లోపం కలిగిన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి ఎత్తు, బరువుల్లో మార్పు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. నెల నెల చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పోషణ్ యాప్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ జగనమ్మ, టీచర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ మెహర్ ఉన్నిసా బేగం


మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

సమష్టి కృషితోనే విజయం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక ఎన్నికలపై కుల్కచర్ల ఎంపీటీసీ పరిధిలోని కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన పాలనను అందిస్తుందని చెప్పారు. పేదలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నామని, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ఫలితాలు చేరేలా కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బీ–బ్లాక్ అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌నాయక్, వెంకటేశ్, అంజిలయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారుల నియామకం

తాండూరు రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా అధికారులు మండలానికి ఆర్వోను నియమించారు. తాండూరు మండలంలో జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి పంచాయతీరాజ్ డీఈఈ నాగభూషణంను ఎన్నికల అధికారి(ఆర్వో)గా ప్రకటించారు. మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిని నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఆ క్లస్టర్లకు ఐదు మంది ఆర్వోలు, ఐదు మంది అసిస్టెంట్ ఆర్వోలను నియమించినట్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపింది. ఇందులో అంతారం–1, అంతారం–2, గోనూర్, బెల్కటూర్ ఎంపీటీసీ క్లస్టర్లకు ఆర్వోగా(జి.వెంకట్‌స్వామి), చంద్రవంచ, కరన్‌కోట్–1, కరన్‌కోట్–2, కరన్‌కోట్–3 ఎంపీటీసీ క్లస్టర్లకు ఆర్వోగా(ఎం.వెంకన్న), చెంగోల్, జినుగుర్తి, గౌతపూర్, కోటబాసుపల్లి ఎంపీటీసీ క్లస్టర్లకు ఆర్వోగా(జి.విద్యాసాగర్), మల్కాపూర్, సంగెంకలాన్, సిరిగిరిపేట్ ఎంపీటీసీ క్లస్టర్లకు ఆర్వోగా(టి.మహేందర్)లను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. ఒక ఆర్వో కిరణ్‌కుమార్ రిజర్వులో ఉంటారన్నారు. ఎంపీటీసీ క్లస్టర్లకు ఐదు మంది ఆర్వోలతో పాటు ఐదు మంది అసిస్టెంట్ ఆర్వోలను కూడా ప్రభుత్వం నియమించింది. ఇందులో మల్లప్ప, రవి, ఆనందం, అంజిలయ్య, శాంతుకుమార్ ఉన్నారని చెప్పారు.

కల్వర్టులు ఛిద్రం.. వెళ్లేటప్పుడు భద్రం

ధారూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులన్నీ ఛిద్రమయ్యాయి. కల్వర్టులు, వంతెనల వద్ద పరిస్థితి దారుణంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. ధారూరు మండలంలోని నాగసమందర్ నుంచి పెద్దేముల్ వెళ్లే మార్గంలో ఒగులాపురం సమీప పోతులోని వాడుక వద్ద భారీ వర్షానికి కల్వర్టు, రోడ్డు దెబ్బతింది. నాగసమందర్ నుంచి కోట్‌పల్లి వెళ్లే దారిలో మైసమ్మ గుడి వద్ద కల్వర్టు రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో ఆయా దారుల్లో వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


ఒగులాపురం పోతులోని వాడుక వద్ద ఛిద్రమైన కల్వర్టు రోడ్డు


మైసమ్మ గుడి సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీను నాయక్


హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

షాద్‌నగర్: రైతులు పంటలు పండించే భూముల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించొద్దని, కొత్త అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కేశంపేట మండలం తొమ్మిదిరేకుల, ఫరూఖ్‌నగర్ మండలం భీమారం, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డతండా, కొందుర్గులోని తంగెళ్లపల్లి, చెరుకుపల్లి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సీపీఎం నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయానికి తరలివెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. పంటలు పండే పొలాల గుండా రోడ్డు నిర్మిస్తే ఎంతో విలువైన భూములను రైతులు కోల్పోవడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డు మార్కింగ్‌ను మార్చి.. పాత పద్ధతి ప్రకారమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుత అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలన్నారు. రైతులు తమకున్న కొద్దిపాటి పొలాల్లో పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నారని, అలాంటి రైతుల పొలాల గుండా ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో రైతులతో గ్రామసభలను నిర్వహించాలని, ప్రజల ఆమోదం మేరకు ప్రజలకు అవసరం లేని భూములను మాత్రమే ప్రభుత్వం తీసుకొని రోడ్డు నిర్మించాలన్నారు. అలా కాకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసి బలవంతంగా భూములు తీసుకునేందుకు ప్రయత్నిస్తే చూస్తే ఊరుకోమన్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రైతుల పోరాటానికి తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు చంద్రకాంత్, రమేశ్, హరీశ్, నరేశ్, సుదర్శన్‌రెడ్డి, యాదయ్య, భీమయ్య, మల్లయ్య, సత్తయ్య, యాదమ్మ, విజయ, అనంతమ్మ, మాణెమ్మ, లక్ష్మమ్మ, కుమార్, శోభ, మంజుల శివరాములు తదితరులు పాల్గొన్నారు.

నేతల ముందస్తు అరెస్టు


షాద్‌నగర్: పోలీస్ స్టేషన్‌లో సీపీఎం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

షాద్‌నగర్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళ్తున్న సీపీఎం, బీఆర్ఎస్ పార్టీ నాయకులను సోమవారం ఉదయం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడదల చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంటే పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం సరికాదని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌నాయక్, శ్రీకాంత్, వీరేశం, నాగేశ్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితుల అరెస్టు

కొందుర్గు: ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులను సోమవారం కొందుర్గు పోలీసులు అరెస్టు చేశారు. తమ భూముల నుంచి ట్రిపుల్ ఆర్ వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ చలో హెచ్ఎండీఏ పిలుపుమేరకు ముందస్తుగా రైతులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ప్రాణాలతో చెలగాటం!


కొత్తూరు పారిశ్రామికవాడ

- రక్షణ కవచాలు కరువు
- ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న కార్మికులు
- పట్టించుకోని పరిశ్రమల యాజమాన్యాలు

కొత్తూరు: కార్మికుల శ్రమతో కోట్ల రూపాయల లాభాలు అర్జిస్తున్న పరిశ్రమల నిర్వాహకులు వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. చట్ట ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు, పనిచేసే చోట రక్షణ పరికరాలు కల్పించడం లేదు. దీంతో పరిశ్రమల్లో ఏ చిన్న ప్రమాదం చోటు చేసుకున్న కార్మికులు తీవ్రంగా గాయపడడం లేదా మృత్యువాత పడుతున్నారు. పరిశ్రమలను సందర్శించి కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించాల్సిన సంబంధిత శాఖల అధికారులు ముడుపుల మాయలో అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పదుల సంఖ్యలో బహుళజాతి, వందల సంఖ్యలో మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అన్ని పరిశ్రమల్లో బీహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఒడిస్సాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు పదివేల మందికిపైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

అవగాహన లేక ప్రమాదాలు

ప్రమాదకర యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం ముందుగా యంత్రాల పనితీరు, ప్రమాదాలు జరిగితే తప్పించుకునే విధానం.. ఇతర జాగ్రత్తలపై తరచూ కార్మికులకు అవగాహన కల్పించాలి. అంతేకాకుండా యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు తప్పకుండా గ్లౌజులు, షూస్, హెల్మెట్లు ఇతర రక్షణ కవచాలను అందించాలి. కానీ మండలంలో కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు రక్షణ కవచాలను అందించడం లేదు. నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన కార్మికులు రక్షణ కవచాలు లేకుండానే ప్రమాదకర యంత్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏ చిన్న ప్రమాదం చోటు చేసుకున్న కార్మికులు తీవ్రంగా గాయపడడం లేదా మృత్యువాత పడడం జరుగుతోంది.

పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదాలు



అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరచూ పరిశ్రమలను సందర్శించి కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను అధికారులు పరిశీలించాలి. యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు రక్షణ కవచాలు అందించే విధంగా యాజమాన్యాలకు సూచించాలి. అప్పుడే ప్రమాదాలను సాధ్యమైనంతవరకు నియంత్రించే అవకాశం ఉంటుంది.

–పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రమాదాలు ఇలా..

- గత నెల 14న తీగాపూర్ సమీపంలోని రాయలసీమ పరిశ్రమలో విధుల్లో భాగంగా బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ అనే కార్మికుడు క్రేన్‌తో ఇనుప చువ్వలు లోడ్ చేస్తున్నాడు. అన్‌లోడ్ చేసే క్రమంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో ఇనుప చువ్వలు అతడిపై పడ్డాయి. పరిశ్రమ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.
- రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్(40) గత కొన్ని నెలల నుంచి పారిశ్రామికవాడలో ఉన్న కేశ్రీ మెటల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 3న విధుల్లో భాగంగా ఫర్నస్ నుంచి వేడిగా బయటకు వచ్చే 8 ఎంఎం రాడ్‌ను పక్కార్‌తో పట్టుకొని చల్లబర్చే చోట పనిచేస్తున్నాడు. కాగా వేడిగా ఉన్న ఇనుప రాడ్ చాతిలోకి దూసుకెళ్లింది. వెంటనే పరిశ్రమ యాజమాన్యం చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.